www.prajasakti.com
ప్రజాశక్తి
మంగళవారం 29 నవంబర్ 2022
5
చిత్తూరు

2న కుప్పంలో జాబ్‌మేళా

చిత్తూరుఅర్బన్: ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివద్ధి, శిక్షణ సంస్థ ఆద్వర్యంలో డిసెంబర్ 2 న కుప్పంలో జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ యం. హరి నారాయణన్ తెలిపారు. సోమవారం ఉదయం జిల్లా సచివాలయంలోని 'స్పందన' హాల్ నందు కుప్పంలో నిర్వహించనున్న జాబ్ మేళా కు సంబంధించిన పోస్టర్ ను డి ఆర్ డి ఏ పి డి. తులసి, జెడ్ పి సి ఈ ఓ ప్రభాకర్ రెడ్డిలతో కలసి ఆవిష్కరించారు.

అక్రమార్కులకు రాజమార్గం

కాసుల (కనికా)పురం

'ప్రభుత్వ ఆదాయానికి గండిపడితే మాకేంటి..మా జేబులు నిండుతున్నాయి.. అధికారులకు అక్రమ ఆదాయం అందుతోంది.. సరుకు రవాణా ఆలస్యం కాకుండా జరిగిపోతుంది.. సరుకు రవాణా సక్రమమా.. అక్రమమా అన్నది వారు కురిపించే కాసులను బట్టి ఉంటుంది' ఇది కనికాపురం చెక్‌పోస్టులో 'పొరుగు సిబ్బంది' విధుల తీరు.. 'కాసులు' కురిపిస్తే చాలు చెక్‌పోస్టులో వాహనాలు రయ్‌రయ్‌మంటాయి..

'ప్రైవేట్ సేవల' సిబ్బందిదే హవా

లంచమిస్తే..చెక్‌పోస్టులో 'రైట్‌రైట్'

ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండి

పజాశక్తి - యాదమరి

చిత్తూరు -గుడియాత్తం అంతరాష్ట్ర రహదారి మార్గమధ్యంలో బంగారుపాళ్యం ఎఎంసి పరిధిలో తమిళనాడు సరిహద్దులో కనికాపురం వద్ద ఏర్పాటు చేసిన చెక్‌పోస్టు అక్రమ రవాణాకు రాజమార్గంగా ఉంది. చిత్తూరు నుండి పల్లిగొండ తమిళనాడు జాతీయ రహదారికి 35 కిలోమీటర్లు దగ్గర రహదారి. టోల్ గేట్లు లేకపోవడంతో ప్రతిరోజూ 300 నుండి 400 లారీలు వివిధ రకాల ఉత్పత్తులతో వెళుతుంటాయి. వ్యవసాయ శాఖ ఉత్పత్తులు సరిహద్దులు దాటాలన్నా, ఇతర ప్రాంతాలకు తరలిపోవాలన్నా ఏఎంసి వ్యవసాయ మార్కెట్ కమిటీ తనిఖీ కేంద్రాల్లో నిబంధనల మేరకు ప్రభుత్వానికి పన్ను కట్టాలి. తద్వారా ప్రభుత్వానికి ఆదాయాన్ని అందించాలి. ఇదంతా కాగితాల్లో మాత్రమే... ప్రభుత్వ ఆదాయం పక్కన పెడితే ఏఎంసీ తనిఖీ కేంద్రాలు సిబ్బందికి మాత్రం కల్ప వక్షంలో జేబులు నింపుతున్నాయి. సంబంధంలేని సరుకు ఏదైనా సరే రూపాయలు 50, వ్యవసాయ ఉత్పత్తులైతే రూపాయలు 100 నుంచి 200 వరకు చేతిలో పెట్టాల్సిందే. లేకుంటే ఇక్కడే తనిఖీ పేరుతో కాలయాపన తప్పదు. వాహన చోదకులు మాత్రం నిబంధనలకు అనుగుణంగా లోడు ఉన్న లేకున్నా ఎందుకు వచ్చిన గొడవ అనుకుని వాహనంలో నుంచే అక్కడ సిబ్బంది చేతిలో పచ్చ నోటు పెట్టేస్తారు. ఎంతో కొంత ప్రభుత్వానికి లెక్క కట్టాలి కాబట్టి పూర్తిగా నిబంధనలకు విరుద్ధంగా ఉన్న కొన్ని వాహనాల నుంచి వసూలు చేసిన మొత్తాన్ని మాత్రమే లెక్క

చూపుతుంటారు ఇక్కడి అక్రమ వసూలు ఏసీబీ అధికారులకు పట్టుబడని విధంగా సిబ్బంది నియమించుకున్న ప్రైవేటు వ్యక్తులే వసూళ్లకు పాల్పడుతుంటారు.

యాదమరి మండలం తమిళనాడు సరిహద్దు ప్రాంతం కావడంతో క్రమంగా వ్యవసాయ ఉత్పత్తులు, పశువులు, కలప ,బియ్యం, గ్రానైట్, సిమెంటు వంటి వస్తువులను అక్రమంగా ఇతర రాష్ట్రాలకు యదేచ్ఛగా తరలిస్తారు. చెక్ పోస్ట్ సిబ్బంది మామూలు తీసుకొని అక్రమ వాహనాలు సరిహద్దులు దాటిస్తున్నాయని ఆరోపణలు ఉన్నాయి. అక్రమ రవాణాలను అరికట్టి వ్యవసాయ మార్కెట్ కమిటీలకు ఆదాయాన్ని అర్జించి పెట్టాల్సిన చెక్పోస్టుల్లో జరుగుతున్న అక్రమాలకు ఉదాహరణ మాత్రమే ఇది. పన్ను తప్పనిసరి అంశంగా మారడం వాహనాల రాకపోకలు అధికంగా ఈ దారిలో ఉండడంతో తనిఖీ కేంద్రాల్లో కాసుల వర్షం కురిపిస్తుంది. జాతీయ రాష్ట్రీయ రహదారుల్లోని చెక్ పోస్టు రాత్రి పగలు తేడా లేకుండా ఎనీ టైం మనీ చెక్పోస్టులుగా విరాజిల్లుతున్నాయి. వసూళ్లలో మాత్రం పొరుగు సేవల సిబ్బందితోపాటు అనధికారికంగా నియమించుకున్న ప్రైవేటు సిబ్బంది కీలకపాత్ర పోషిస్తుంటారు .చెక్పోస్టు అధికారి నుంచి కార్యాలయ సిబ్బంది వరకు ఎవరి వాటా వారికి వెళ్తుండడంతో చెక్ పోస్ట్ ల పనితీరుపై అసలు తనిఖీలే ఉండటం లేదన్న విమర్శలు ఉన్నాయి .

విధుల్లో నిర్వహిస్తున్న ప్రభుత్వ సిబ్బంది నిబంధనలకు నీళ్లు వదిలి అందినంత దోచుకుంటున్నారని వాహనదారులు స్థానికులు విమర్శిస్తున్నారు. వే బిల్లులు రూట్ పర్మిట్లు ఉన్నా వాహనాలు వెళ్లాలంటే 100 నుండి 500 రూపాయలు వసూలు చేస్తున్నారని వాహనదారులు ఆరోపిస్తున్నారు. ఓవర్ లోడ్ తో వాహనాలు వస్తే వీరికి పండగే. అడిగినంత ఇవ్వకుంటే వాహనాన్ని పక్కన పెడతారు. ఇక్కడ అధికారులు కంటే దళారులే అధికంగా ఉన్నారు. అక్రమ వ్యాపారం చేసేవారు దళారుల ద్వారా సంప్రదించి వ్యవహారాలు కొనసాగిస్తున్నారు .ఇంత జరుగుతున్న ఉన్నతాధికారులు పట్టించుకోకపోవడంతో వీరి ఆగడాలకు హద్దు లేకుండా పోతుంది ఇప్పటికైనా అధికారులు స్పందించి అక్రమ వాహనాలకు చెక్ పెట్టి ప్రభుత్వాదాయానికి గండిపడకుండా చూడాల్సిన బాధ్యత ఎంతైనా ఉంది.

వైయస్సార్ సున్నా వడ్డీ పంట రుణాలు

31,777 మంది రైతులకు రూ.8.47 కోట్లు జమ

ప్రజాశక్తి - చిత్తూరు అర్బన్

వైఎస్ఆర్ సున్నా వడ్డీ పంట రుణాలను జిల్లాలో 31,777 మంది రైతులకు రూ.8.47 కోట్లు జమచేసినట్లు కలెక్టర్ వెల్లడించారు. వ్యవసాయ రంగంమీద 62శాతంమంది జనాభా ఆధారపడి జీవిస్తున్నారని, రైతులను ఆదుకునేందుకు ప్రభుత్వం అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోందని ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి అన్నారు. తాడేపల్లినుండి వైఎస్ఆర్ సున్నా వడ్డీ పథకాన్ని వర్చువల్ విధానంలో సోమవారం ప్రారంభించారు. జిల్లా సచివాలయంలోని వీడియో కాన్ఫరెన్స్ హాలు నుంచి జడ్‌పి ఛైర్మన్ గోవిందప్ప శ్రీనివాసులు, కలెక్టర్ ఎం.హరినారాయణన్, ఎంఎల్ఎ ఆరణి శ్రీనివాసులు, నగర మేయర్ అముద, వ్యవసాయ సలహా మండలి ఛైర్మన్ రామచంద్రారెడ్డి, విదేశీ వ్యవహారాల ప్రభుత్వ సలహాదారు జ్ఞానేంద్రరెడ్డి, స్త్రీ శిశు సంక్షేమ రాయలసీమ రీజినల్ ఛైర్‌పర్సన్ శైలజా చరణ్‌రెడ్డి, డిప్యూటీ మేయర్ చంద్రశేఖర్‌రెడ్డి, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి రత్నప్రసాద్, హార్టికల్చర్ అధికారి మధుసూదన్‌రెడ్డి, ఎల్‌డిఎం శేషగిరిరావు పాల్గొన్నారు. జెడ్పి ఛైర్మన్ మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి నేడు ప్రారంభించిన మూడవ విడత వైయస్సార్ సున్నా వడ్డీ పథకం ద్వారా

జిల్లా లోని 31,744 మంది రైతన్నలకు రూ.8.47 కోట్లు, రైతులకు పెట్టుబడి రాయితీ ద్వారా 1,277 మందికి రూ.56.99 లక్షలు జమ చేసారని తెలిపారు. ఏ సీజన్ కు ఆ సీజన్ లో పంట నష్టపోయిన రైతుకు ఈ-కె వై సి ద్వారా నమోదు చేసి పెట్టుబడి సాయం అందిస్తున్నారన్నారు.

భారత రాజ్యాంగం 'హృదయం'వంటిది

చిత్తూరుఅర్బన్: భారతదేశానికి రాజ్యాంగం హదయం వంటిదని అంబేద్కర్ యువజన సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చింతమాకుల పుణ్యమూర్తి పేర్కొన్నారు. సోమవారం చిత్తూరు నగరంలోని పిసిఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఘనంగా భారత రాజ్యాంగ ఆమోదిత దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా

ఆయన మాట్లాడుతూ డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ భారత రాజ్యాంగాన్ని నిర్మించారని, అన్ని వర్గాలతో సమానంగా బడుగు బలహీన వర్గాలకు న్యాయం చేస్తూ రచించిన ఈ రాజ్యాంగం భారతదేశానికి మార్గ నిర్దేశం గా పనిచేస్తుందన్నారు. రాజ్యాంగం ప్రకారం న్యాయస్థానం స్వతంత్ర ప్రతిపత్తి కలిగిన ఒక ప్రత్యేక వ్యవస్థగా ఏర్పాటు చేశారన్నారు. అంబేద్కర్ రాసిన రాజ్యాంగానికి మనదేశంలోనే కాకుండా ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు లభించిందన్నారు. అనంతరం ఎస్సీ ఎస్టీ గెజిటెడ్ అసోసియేషన్ జీవి సత్యనారాయణ ,చిట్టిబాబు ఆధ్వర్యంలో పిసిఆర్ కళాశాల విద్యార్థులచే వ్యాసరచన పోటీలు నిర్వహించి నగదు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో తమిళనాడు భోజన సమాజ్ పార్టీ ఆర్మీ స్ట్రాంగ్ ,ఆర్జెడి విశ్వనాథ్ నాయక్, డివిఈఓ దయానంద రాజు, సివిక్స్ అధ్యాపకులు, దళిత నాయకులు విద్యార్థులు కళాశాల అధ్యాపక బందం పాల్గొన్నారు.

జ్యోతిరావ్ పూలేకు నివాళి

చిత్తూరుఅర్బన్: ప్రముఖ సంఘ సంస్కర్త, అభ్యుదయవాది స్త్రీ విద్యను ప్రొత్సహించిన జ్యోతిరావు పూలే 132వ వర్ధంతిని పురస్కరించుకొని స్థానిక పిసిఆర్ సర్కిల్‌లో ఉన్న పూలే విగ్రహానికి చిత్తూరు ఎంఎల్ఎ శ్రీనివాసులు, మొదిలియర్ కార్పొరేషన్ ఛైర్మెన్ బుల్లెట్ సురేష్, టౌన్‌బ్యాంకు ఛైర్మెన్ రామ్ గణేష్, డిప్యూటీ మేయర్ చంద్రశేఖర్. టిడిపి బిసి సెల్ నాయకులు షణ్మగం, కోదండయాదవ్, మోహన్‌రాజ్‌లతో పాటు బిసి సంక్షేమ సంఘం జిల్లా ఉపాధ్యక్షులు సురేంద్రయాదవ్, ఎపిటిఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గోపినాథ్, ముక్తార్‌అహ్మద్‌లతో పాటు పలువురు బిసి సంఘాల నేతలు, ప్రజా సంఘాల నాయకులు నివాళి అర్పించారు.

అగ్రిగోల్డ్ బాధితులను ఆదుకోవాలి

తిరుపతి సిటి : రాష్ట్ర ముఖ్యమంత్రి ఎన్నికల ప్రచార సభలలో అధికారంలోకి వచ్చిన ఏడాదిలోగా అగ్రిగోల్డ్ బాధితులకు ప్రభుత్వమే డిపాజిట్లు చెల్లిస్తుందని నమ్మబలికి, నేడు విస్మరిస్తోందని సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎ.రామానాయుడు, జిల్లా గౌరవాధ్యక్షులు టి.జనార్ధన్ విమర్శించారు. సోమవారం తిరుపతి ఆర్డీవో కార్యాలయం వద్ద అగ్రిగోల్డ్ కష్టమర్లు అండ్ ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 30 గంటల ధర్మాగ్రహ నిరాహారదీక్ష సందర్భంగా వారు ప్రసంగించారు. 20 లక్షల మంది అగ్రిగోల్డ్ బాధితుల ఓట్లతోనే అధికారం పొందామని పలుమార్లు నేతలు ప్రకటించుకుంటున్నారని, అయితే సమస్యల పరిష్కారానికి పట్టీపట్టనట్లు వ్యవహరిస్తున్నారని విమర్శించారు. ప్రభుత్వం వద్ద పదివేల కోట్లకు పైగా అగ్రిగోల్డ్ ఆస్తులు ఉన్నా కేవలం ఐదువేల కోట్లను చెల్లించేందుకు మీనమేషాలు లెక్కిస్తున్నారని ధ్వజమెత్తారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు బెల్లంకొండ శ్రీనివాసులు, సిపిఐ జిల్లా కార్యదర్శి పి.మురళి, పెంచలయ్య, రాధాక్రిష్ణ పాల్గొన్నారు.

గ్రామ పంచాయతీకి అభివృద్ధి ప్రణాళిక ఉండాలి

జెడ్పి చైర్మెన్ శ్రీనివాసులు

చిత్తూరుఅర్బన్: ప్రతి గ్రామ పంచాయితీ అభివృద్ధి ప్రణాళిక రూపొందించుకొని దానికి అనుగుణంగా అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టాలని జిల్లా పరిషత్ ఛైర్మెన్ గోవిందప్ప శ్రీనివాసులు అన్నారు. సోమవారం చిత్తూరు, జీడి నెల్లూరు, నగరి, పూతలపట్టు

మండలాల గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళికను ఆవిష్కరించారు. అనతరం జెడ్పి సమావేశ మందిరంలో గ్రామ అభివృద్ధి ప్రణాళికపై శిక్షణా తరగతులను జెడ్పి ఛైర్మెన్ శ్రీనివాసులు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సిఇఒ ప్రభాకర్‌రెడ్డి, డిపిఒ లక్ష్మి, జెడ్పి కోఆర్డినేటర్ షణ్ముగరామ్ లతో చిత్తూరు, జీడినెల్లూరు, నగరి, పూతలపట్టు మండలాల గ్రామ పంచాయితీ అధికారులు పాల్గొన్నారు.

గృహ నిర్మాణ లక్ష్యాలను చేరుకోవాలి

చిత్తూరుఅర్బన్: రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులుగా ప్రభుత్వ లక్ష్యాలను పూర్తి చేయాల్సిన బాధ్యత ఎంతైనా ఉందని, అత్యంత బాధ్యతతో పారదర్శకంగా పనులు నిర్వహించి పూర్తి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని జిల్లా కలెక్టర్ ఎం హరి నారాయణన్ అన్నారు. సోమవారం సాయంత్రం జిల్లా కలెక్టర్ జిల్లాలో జరుగుతున్న గృహ నిర్మాణ పనుల గురించి వీడియో కాన్ఫరెన్స్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఇప్పటివరకు గృహ నిర్మాణానికి సంబంధించి 610 కోట్ల రూపాయలు ఖర్చు చేసి సుమారు 53వేల గహాల నిర్మాణాలు జరుగుతున్నాయని, వాటిని మరింత వేగవంతం చేసి పూర్తి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని అన్నారు. లక్ష్యాల సాధనలో వెనుకబడిన పూతలపట్టు, కుప్పం, నగిరి నియోజకవర్గ ఇంజనీరింగ్ అధికారులను కారణాల గురించి అడిగారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఎస్. వెంకటేశ్వర్, గహ నిర్మాణ శాఖ పిడి పద్మనాభం పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలు పునరుద్ధరించాలి

చిత్తూరుఅర్బన్: జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం నిలిపివేసిన ఎస్సీ, ఎస్టీ ల 27 సంక్షేమ పథకాలను యుద్ధ ప్రాతిపదిక పైన పునరుద్ధరించాలని ఆల్ ఇండియా దళిత్ రైట్స్ మూమెంట్, (ఏ ఐ డి ఆర్ ఎం) జాతీయ కౌన్సిల్ సభ్యులు యస్. నాగరాజు, దళిత హక్కుల పోరాట సమితి (డి హెచ్ పి ఎస్) రాష్ట్ర సంఘం పిలుపు మేరకు సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. అనంతరం కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. యస్ .నాగరాజు, దళిత హక్కుల పోరాట సమితి చిత్తూరు నియోజకవర్గ అధ్యక్షులు దాసరి చంద్ర ,కార్యదర్శి పెనుమూరు బాబు మాట్లాడుతూ గత ప్రభుత్వాలు పాలనలో ఎస్సీ ,ఎస్టీ ,బీసీ, ముస్లిం మైనార్టీలకు అనేక సంక్షేమ పథకాలను కార్పొరేషన్ ద్వారా రుణాలు అందిస్తున్న పథకాలను ప్రస్తుతం అధికారంలో ఉన్న జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం రద్దుచేసి ఎస్సీ ఎస్టీ బీసీ ముస్లిం మైనార్టీలను మోసం చేసిందని ఆవేదన వ్యక్తం చేశారు.

'స్పందన'కు 185అర్జీలు

చిత్తూరుఅర్బన్ :స్పందనలో వచ్చే సమస్యలను వెంటనే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ యం. హరి నారాయణన్ పేర్కొన్నారు. సోమవారం ఉదయం డి.ఆర్.ఓ ఎన్.రాజశేఖర్ తో కలిసి జిల్లా నలుమూలల నుండి వివిధ రకాల సమస్యలతో వచ్చిన అర్జీ దారుల నుండి అర్జీలను స్వీకరించారు. మొత్తం: 185 అర్జీలు రాగా, ఇందులో రెవెన్యూ శాఖకు సంబంధించి 110 పెద్దమొత్తంలో ఉన్నాయి.

స్పందన ఫిర్యాదుల పరిష్కారంలో అలసత్వం చేయరాదని సోమవారం జరిగిన స్పందన కార్యక్రమంలో 25 ఫిర్యాదులను స్వీకరించిన జిల్లా అడిషనల్ ఎస్పీ జగదీష్ అన్నారు. స్పందన కార్యక్రమానికి వచ్చిన ఫిర్యాదులన్నింటిపై చట్ట ప్రకారం విచారణ జరిపి, నిర్దేశించిన గడువులోగా ఫిర్యాదు దారుల సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని సంబంధిత పోలీసు అధికారులను ఆదేశించారు. ఈ ఫిర్యాదులకు స్పందిస్తూ అడిషనల్ ఎస్పి బాధితుల ఎదుటే వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సంబంధిత అధికారులకు సమస్యను పరిష్కరించేలా ఆదేశాలు జారీ చేశారు.

స్పందన సమస్యలు వేగంగా పరిష్కరించాలి

స్పందన కార్యక్రమంలో ప్రజల నుంచి అందే వినుతులను వేగంగా

పరిష్కరించాలని నగర కమిషనర్ అరుణ అధికారులను ఆదేశించారు. సోమవారం నగరపాలక కార్యాలయంలో "స్పందన" కార్యక్రమాన్ని నిర్వహించి ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా కమిషనర్ స్పందన ఫిర్యాదులపై సంబంధిత అధికారులు క్షేత్ర స్థాయిలో పర్యటించి, పరిశీలించి, నివేదిక సమర్పించాలన్నారు. గత వారం అందిన వినతులపై శాఖాధిపతులతో చర్చించారు. స్పందన వినతులపై శాఖాధిపతులు ప్రతి శనివారం సమీక్షించుకోవాలన్నారు. నవోదయ కాలనీకి దారి సౌకర్యం కల్పించాలని స్థానికులు వినతిపత్రం సమర్పించారు. స్పందన కార్యక్రమంలో మొత్తం ఐదు వినతులు... టీపీవో -3, ఇంజనీరింగ్ విభాగం -2 వినతులు అందాయి. కార్యక్రమంలో సహాయ కమిషనర్ గోవర్ధన్, ఇతర అధికారులు పాల్గొన్నారు

పండ్ల సమాఖ్య రూ. 50వేల విరాళం

చిత్తూరుఅర్బన్ : క్షయ వ్యాధి నిర్మూలనకు వారికి పౌష్టికాహారం అందజేసేందుకు ముందుకు వస్తున్న వారిని అభినందించాలని కలెక్టర్ ఎం. హరి నారాయణన్ అన్నారు. సోమవారం మధ్యాహ్నం జిల్లా పండ్ల సమాఖ్య ఆధ్వర్యంలో క్షయవ్యాధి నిర్మూలన కోసం ప్రభుత్వం చేస్తున్న కషిలో తాము కూడా ఉంటామని తమ వంతు సహాయంగా 50 వేల రూపాయల చెక్కును జిల్లా కలెక్టర్కు పండ్ల సమాఖ్య అధ్యక్షుడు శివ కుమార్ రెడ్డి, కార్యదర్శి గోవర్ధన్ బాబి, అమర్నాథ్ తదితరులు అందజేశారు. రోగ నిరోధక శక్తి పెంచేందుకు దాతలు స్వచ్ఛందంగా ముందుకు రావడం, ద్వారా జిల్లాను టీబి రహిత జిల్లాగా చేద్దాం అని కలెక్టర్ పిలుపునిచ్చారు.

అమ్మవారి బ్రహ్మోత్సవాలు 'సమాప్తం'

పజాశక్తి - తిరుచానూరు

తిరుచానూరు శ్రీ పద్మావతి అమ్మవారి ఆలయంలో తొమ్మిది రోజుల పాటు జరిగిన కార్తీక బ్రహ్మోత్సవాలు సోమవారం పంచమితీర్థ మహోత్సవంతో ఘనంగా ముగిశాయి. చివరిరోజు ఆలయం వద్ద గల పద్మ పుష్కరిణిలో జరిగిన చక్రస్నానం కార్యక్రమానికి విశేష సంఖ్యలో భక్తులు విచ్చేశారు. జేఈవో వీరబ్రహ్మం ఆధ్వర్యంలో టీటీడీ విస్తత ఏర్పాట్లు చేపట్టింది. టీటీడీ ధర్మకర్తల మండలి అధ్యక్షులు వైవి.సుబ్బారెడ్డి, ఈవో ధర్మారెడ్డి, సివిఎస్వో నరసింహ కిషోర్, ఎస్పీ పరమేశ్వర్ రెడ్డి, ఎస్వీబీసీ సిఈఓ షణ్ముఖ్ కుమార్ , టీటీడీ చీఫ్ ఇంజినీర్ నాగేశ్వరరావు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు

పంచమితీర్థానికి విచ్చేసిన భక్తులకు పోలీసు శాఖ సమన్వయంతో టీటీడీ పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేపట్టింది. భక్తులు సేద తీరడానికి ఏర్పాటు చేసిన జర్మన్ షెడ్ల నుంచే ప్రత్యేకంగా క్యూలైన్లు ఏర్పాటుచేసి భక్తులను క్రమపద్ధతిలో పుష్కరిణిలోకి అనుమతించారు. పుష్కరిణిలోకి ప్రవేశించేందుకు, తిరిగి వెళ్లేందుకు వేరువేరుగా గేట్లను ఏర్పాటుచేశారు. సివిఎస్వో నరసింహ కిషోర్, ఎస్పీ శ్రీ పరమేశ్వర్ రెడ్డి ఆధ్వర్యంలో విజిలెన్స్ అధికారులు, పోలీసు అధికారులతో సమన్వయం చేసుకుని పుష్కరిణి వద్ద భద్రతా ఏర్పాట్లు చేపట్టారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా పార్కింగ్ ఏర్పాట్లు, ట్రాఫిక్ మళ్లింపు చర్యలు చేపట్టారు. కాలినడకన వచ్చిన భక్తులకు ఇబ్బందులు లేకుండా తిరుచానూరు బయటి నుంచే వాహనాలను దారి మళ్లించారు. తిరుపతి నుంచి వచ్చే వాహనాలకు, పాడిపేట వైపు నుంచి వచ్చే వాహనాలకు ఆయా ప్రాంతాల్లో పార్కింగ్ ఏర్పాట్లు చేపట్టారు. 2500 మంది పోలీసులతోపాటు టీటీడీ భద్రతా సిబ్బంది, స్కౌట్స్ అండ్ గైడ్స్, ఎన్.సి.సి విద్యార్థులతో భద్రతా ఏర్పాట్లు చేశారు.

భక్తులకు వైద్యసేవలు

బ్రహ్మోత్సవాలకు విచ్చేసిన భక్తులకు విశేషంగా వైద్యసేవలు అందించారు. అమ్మవారి వాహనం మోసే వాహనబేరర్లకు వైద్యపరంగా తగిన చర్యలు చేపట్టి ఉపశమనం కల్పించారు. టీటీడీ వైద్యులతోపాటు స్విమ్స్, రుయా ఆస్పత్రుల నుంచి వైద్యసిబ్బంది, ఆయుర్వేద వైద్యులు సేవలందించారు. తోళప్పగార్డెన్‌లో ఉన్న డిస్పెన్సరీతోపాటు అదనంగా డాక్టర్లు, పారామెడికల్ సిబ్బంది అందుబాటులో ఉన్నారు. 6 అంబులెన్సులతోపాటు శుక్రవారపుతోట పద్మపుష్కరిణి వద్ద ప్రథమచికిత్స కేంద్రాలు ఏర్పాటు చేశారు.

శ్రీవారి ఆలయం నుండి సారె

తిరుచానూరు శ్రీ పద్మావతి అమ్మవారి బ్రహ్మోత్సవాల్లో చివరి రోజైన సోమవారం పంచమితీర్థం ఉత్సవాన్ని పురస్కరించుకుని తిరుమల శ్రీవారి ఆలయం నుంచి సారె సమర్పించారు. ప్రతి ఏటా పంచమితీర్థం రోజున తిరుమల నుంచి సారె తీసుకెళ్లడం ఆనవాయితీగా వస్తోంది. శ్రీవారి ఆలయంలో జరిగిన కార్యక్రమంలో టిటిడి ఛైర్మన్ వైవి.సుబ్బారెడ్డి, ఈవో ఎవి.ధర్మారెడ్డి పాల్గొన్నారు. ఆభరణంతో కూడిన శ్రీవారి సారెను అలిపిరి వద్ద ఈవో ఎవి.ధర్మారెడ్డి జెఈవో వీరబ్రహ్మానికి అందజేశారు.

విజయవంతంగా అమ్మవారి పంచమితీర్థం : ఛైర్మన్

తిరుచానూరు శ్రీ పద్మావతి అమ్మవారి బ్రహ్మోత్సవాల్లో ముఖ్యమైన పంచమితీర్థం కార్యక్రమం భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా విజయవంతంగా నిర్వహించామని టీటీడీ ఛైర్మన్ వైవి సుబ్బారెడ్డి చెప్పారు. మీడియాతో మాట్లాడారు. నవంబరు 20వ తేదీ శ్రీ పద్మావతి అమ్మవారి బ్రహ్మోత్సవాలు ప్రారంభమయ్యాయని తెలిపారు. సోమవారం పంచమితీర్థం కార్యక్రమంలో లక్ష మందికి పైగా భక్తులు హాజరై పుణ్య స్నానాలు చేశారన్నారు. ఇందుకు తగిన ఏర్పాట్లు చేశామన్నారు. తిరుపతి చుట్టు పక్కల ప్రాంతాలతో పాటు తమిళనాడు నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు ఆదివారం రాత్రికే తిరుచానూరు చేరుకున్నారని ఛైర్మన్ తెలిపారు. కరోనా కారణంగా

రెండేళ్ళ తరువాత పంచమితీర్థం పుష్కరిణిలో చేస్తున్నందువల్ల పెద్ద సంఖ్యలో భక్తులు హాజరవుతారని టీటీడీ యాజమాన్యం ముందుగానే అంచనా వేసిందన్నారు. ఇందులో భాగంగానే మూడు తాత్కాలిక షెడ్లు ఏర్పాటు చేసి అందులో భక్తులు సేద తీరడంతో పాటు వారికి ఆదివారం రాత్రి నుంచే అన్నప్రసాదాలు, కాఫీ, టీ, పాలు, తాగునీరు అందించామని ఆయన వివరించారు.

భక్తులకు సర్పంచి రామచంద్రారెడ్డి అన్నదానం

శ్రీ పద్మావతి అమ్మవారి బ్రహ్మోత్సవాల్లో చివరి ఘట్టమైన పంచమి తీర్థానికి విచ్చేసే భక్తులకు తిరుచానూరు సర్పంచ్ రామచంద్రారెడ్డి రెడ్డి అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రామచంద్రారెడ్డి మాట్లాడుతూ అమ్మవారి భక్తులకు ప్రతి సంవత్సరం అన్నదాన కార్యక్రమం చేయడం ఆనవాయితీగా వస్తుందని, స్థానిక ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి సహకారంతో ఇలాంటి బహత్తర కార్యక్రమాన్ని దిగ్విజయంగా జరుపుతున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ సతీమణి మధు రెడ్డి మంజులరెడ్డి, ధనుష్ రెడ్డి, ఎంపీటీసీలు నరేష్ రెడ్డి, శేఖర్ రెడ్డి ,వార్డ్ నెంబర్లు మునీంద్ర రాయల్ , ముళ్లపూడి సర్పంచ్ సూరి, ఎక్స్ సర్పంచ్ వెంకటరమణ, రాజేంద్ర, నాయక్, బ్రాహ్మణ పట్టు ఎంపీటీసీ యోగానంద రెడ్డి , మార్కెట్ యార్డ్ చైర్మెన్ విద్యా గణపతి నాయుడు, ఆర్.ఆర్. యూత్ పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

సిఐటియు మండల అధ్యక్షకార్యదర్శుల ఎన్నిక

ప్రజాశక్తి -పలమనేరు: పలమనేరు మండల సిఐటియు అధ్యక్ష కార్యదర్శులుగా గిరిధర్ గుప్తా సుబ్రహ్మణ్యంలను ఎనుకున్నట్లు సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి చైతన్య తెలిపారు. ఆదివారం సాయంత్రం స్థానిక సత్య గంగమ్మ గుడి సత్రంలో సిఐటియు నాలుగవ మండల మహాసభలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు మండల కమిటీలను నూతనంగా ఎన్నుకున్నారు. వారిలో అధ్యక్ష కార్యదర్శులుగా గిరిధర్ గుప్తా, సుబ్రహ్మణ్యం, ఉపాధ్యక్షులుగా సావిత్రి, కోశాధికారిగా సలోమి కార్యవర్గ సభ్యులుగా, అంజి,రాజా, జయంతిలను ఎనుకున్నట్లు చైతన్య తెలిపారు. వీరి పదవి కాలం రెండేళ్ల పాటు ఉంటుందని తెలిపారు. ఎన్నికైన అధ్యక్ష కార్యదర్శులు మాట్లాడుతూ తమపై నమ్మకం ఉంచి తమకు బాధ్యతలు అప్పగించిన జిల్లా కమిటీకి ప్రత్యేక అభినందనలు తెలిపారు

వ్యకాసం రాష్ట్ర మహాసభలను జయప్రదం చేద్దాం

జిల్లా ప్రధాన కార్యదర్శి హంగేరి ఓబుల్‌రాజు

ప్రజాశక్తి-పెద్దపంజాణి: ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రాష్ట్ర మహాసభలను జయప్రదం చేద్దామని జిల్లా ప్రధాన కార్యదర్శి హంగేరి ఓబులరాజు అన్నారు. సోమవారం మండల కేంద్రంలో వ్యవసాయ కార్మిక సంఘం మహాసభలు పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్నపూర్ణగా పేరు గాంచిన ఏలూరు జిల్లా ఏజెన్సీ జంగారెడ్డి గూడెంలో డిసెంబర్ 8, 9, 10 తేదీల్లో ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ మహాసభలు జరుగుతున్నాయని తెలిపారు. రాజ్యాంగాన్ని పరిరక్షించాలని కోరుతూ ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర ప్రజలు వ్యవసాయ రంగం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఆంధ్ర మహాసభలను విజయవంతం చేసేందుకు కృషి చేద్దామని అన్నారు. మండల కార్యదర్శి అమరరాయణ, రామచంద్ర, దిలీప్, వెంకటప్ప వ్యవసాయ రంగ కార్మికులు కర్షకులు పాల్గొన్నారు.

వైసీపీ సింగనమల నియోజకవర్గ

పరిశీలకులుగా వల్లివేడు రాజారెడ్డి

ప్రజాశక్తి-పులిచెర్ల: మండలంలోని వైసిపి నాయకులు వల్లివేడు రాజారెడ్డిని అనంతపురం జిల్లా సింగనమల నియోజవర్గ వైసిపి పరిశీలకులుగా నియమించారు. ఈయన గతంలో రాష్ట్ర అటవీశాఖ డైరెక్టర్‌గా పని చేశారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ విజయానికి కృషి చేశారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో పేరు ప్రఖ్యాతులు కలిగిన వల్లివేడు కుటుంబానికి చెందిన వారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఆశయాల మేరకు పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని అన్నారు. తన నియామకానికి కృషి చేసిన పెద్దాయన, సీనియర్ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా వల్లివేడు రాజారెడ్డిని పలువురు రాష్ట్ర స్థాయి, జిల్లా స్థాయి నాయకులు అభినందించారు.

ఎమ్మెల్సీ ఎన్నికల పరిశీలకులుగా తలపులపల్లి బాబు రెడ్డి

ప్రజాశక్తి-పూతలపట్టు : సత్యసాయి జిల్లా, పెనుగొండ అసెంబ్లీ నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికల పరిశీలకులుగా పూతలపట్టు మండలం, వైసిపి సీనియర్ నాయకులు తలపులపల్లి బాబు రెడ్డిని ప్రభుత్వం నియమించింది. ఈ సందర్భంగా సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, డిప్యూటీ సీఎం నారాయణస్వామి, ఎంపి మిథున్ రెడ్డి, పూతలపట్టు ఎమ్మెల్యే ఎంఎస్ బాబు సహాయ సహకారాలతో పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని తెలిపారు. తనపై నమ్మకం ఉంచి పరిశీలకులుగా నియమించినందుకు కృతజ్ఞతలు తెలిపారు.

వేలం ద్వారా రూ.లక్ష 3 వేల ఆదాయం

ప్రజాశక్తి -పాలసముద్రం: మండలంలోని పోలీస్ స్టేషన్ ఆవరణంలో సోమవారం నిర్వహించిన ద్విచక్ర వాహనం వేలంపాటలో రూ.లక్ష 3 వేలు ప్రభుత్వానికి ఆదాయం వచ్చిందని ఎస్ఐబి సురేష్ తెలిపారు. ఎస్ఐ మాట్లాడుతూ మండలంలో పలు కేసుల్లో పట్టుబడిన 5 ద్విచక్ర వాహనాలు చిత్తూర్ అడిషనల్ స్పెషల్ ఎన్ఫోర్స్‌మెంట్ సూపరిండెంట్ చంద్రశేఖర్ సమీక్షంలో వాహనాలను బహిరంగ వేలం పాట వేశారు. వేలంపాటలో రూ.లక్ష 3 వేలు పాడారని తెలిపారు. వేలంలో పాడిన వారే ఆన్లైన్లో జిఎస్టితో పాటు నగదు చెల్లించి రసీద్ ఇవ్వాలని తెలిపారు. కార్యక్రమంలో ఏఎస్ఐ చక్రవర్తి, మురుగేష్, హెడ్ కానిస్టేబుల్ జానకి పాల్గొన్నారు.

భోజనంలో తాజా కూరగాయలు వాడాలి

ప్రజాశక్తి -పాలసముద్రం: మండల పరిధిలోని ప్రభుత్వ పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకంలో వేస్తున్న జగనన్న ముద్దకు తాజా కూరగాయలు వాడాలని జెడ్పిటిసి సభ్యుడు అన్‌బలగం, ఎంపీడీవో ఎస్.విజయవతి తెలిపారు. సోమవారం పాలసముద్రం ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని వారు క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఎంపీడీవో విద్యావతి మాట్లాడుతూ విద్యార్థులకు పౌష్టికాహారం అందించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం విద్యార్థులకు మధ్యాహ్న భోజనంలో ఒక్కొక్క రోజుకి ఒక మెనూ ప్రకారం భోజనం, ప్రతిరోజు గుడ్డు చిక్కి అందిస్తుందన్నారు. విద్యార్థులకు మధ్యాహ్న భోజనంలో నాణ్యత తప్పక పాటించాలని సూచించారు. అనంతరం కూరగాయలను పరిశీలించారు.

పార్టీ అభివృద్ధికి పని చేస్తా

జెడ్పీ మాజీ చైర్మన్ కుమార్ రాజా

ప్రజాశక్తి - బంగారుపాళ్యం: వైసీపీ అభివృద్ధికి పని చేస్తానని జెడ్పీ మాజీ చైర్మన్ కుమార్ రాజా అన్నారు. సోమవారం తిరుపతిలో మంత్రి పెద్దిరెడ్డి రామ చంద్రారెడ్డి కార్యాలయంలో ఆయన కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భం గా ఆయన మాట్లాడుతూ అనంతపురం జిల్లా రాయదుర్గం నియోజకవర్గం వైసీపీ పరిశీలకులుగా అధిష్టానం నియమించిందని తెలిపారు. తనపై నమ్మకంతో పార్టీ ఈ బాధ్యతలు అప్పగించారని కచ్చితంగా పార్టీ పటిష్టతకు కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో బంగారుపాళ్యం మండల సింగిల్ విండో చైర్మన్ దత్తాత్రేయ రెడ్డి, గీత కార్పొరేషన్ డైరెక్టర్ చెంగల్ రాయలు, ఏ.ఎల్లప్ప, తిమ్మోజి పల్లి మాజీ సర్పంచ్ ప్రకాష్ రెడ్డి పాల్గొన్నారు.

శ్రీ వేణుగోపాలస్వామి గుడి ప్రారంభోత్సవం

ప్రజాశక్తి-పెద్దపంజాణి: మండల పరిధిలోని తుర్లపల్లి పంచాయతీ నగిరేపల్లి గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీవేణుగోపాల స్వామి గుడి ప్రారంభోత్సవ కార్యక్రమంలో జిల్లా పరిషత్ చైర్మన్ శ్రీనివాసులు(వాసు) ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్థానిక సర్పంచ్ మురళి ఆధ్వర్యంలో మండలం లోని నాయకులు సర్పంచులు, ఎంపిటీసీలు ఆయనకు ఘన స్వాగతం పలికారు. మండల కన్వీనర్ బాగారెడ్డి, డా.చంద్రశేఖర్ రెడ్డి, మండి సుధా, సర్పంచులు, రవికుమార్, రమేష్ బాబు, భార్గవ్, స్వర్ణమ్మ, లతీఫ్, మునిరాజ, ఎంపిటిసిలు, పరంధామ, మాజీ ఎంపిటిసి ప్రసాద్ రెడ్డి, తమ్మిరెడ్డి, నాయకులు శ్రీనివాసులు, శివశంకర్ రెడ్డి వార్డు సభ్యులు పాల్గొన్నారు.

టీడీపీ నాయకులను పరామర్శించిన మాజీ మంత్రి

ప్రజాశక్తి-పెద్దపంజాణి: మండలంలోని శివాడి గ్రామానికీ చెందిన తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు ఆరోగ్య రాజు, సుబ్రమణ్యం మాజీ మంత్రి అమర్నాథరెడ్డి సోమవారం పరామర్శించారు. గత కొద్దికాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న విషయాన్ని తెలుసుకున్న ఆయన మండల నాయకులతో కలిసి వారి ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీసి వారిని పరామర్శించారు. పార్టీలోని నాయకులు వారి కుటుంబాలకు అండగా ఉండాలని సూచించారు. మండల టిడిపి అధ్యక్షులు నందకుమార్, మాజీ సర్పంచ్ చలపతి, స్థానిక టిడిపి నాయకులు పాల్గొన్నారు.

వైభవంగా జగనన్న క్రీడా సంబరాలు

ప్రజాశక్తి - నగరి : నగరి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సోమవారం జిల్లా జగనన్న క్రీడా సంబరాలను మంత్రి.ఆర్.కె.రోజా ప్రారంభించారు. చిత్తూరు జిల్లా నుంచి కుప్పం, పలమనేరు, పుంగనూరు, చిత్తూరు, పూతలపట్టు, గంగాధర నెల్లూరు, నగరి నియోజకవర్గాలకు చెందిన క్రీడాకారులు పాల్గొంటున్నారు. క్రీడాకారుల ప్రతిభను గ్రామస్థాయి నుంచి గుర్తించి వారిని మండల, జోనల్, జిల్లా, రాష్ట్రస్థాయిల వరకు తీసుకువెళ్లాలని ఉన్నత లక్ష్యంతో జగనన్న క్రీడా సంబరాలకు శ్రీకారం చుట్టారని అన్నారు. క్రీడలు ప్రతి ఒక్కరిని క్రమశిక్షణతో సమాజంలో మెలిగేలా చేయడంతో పాటు క్రీడాకారుల ఆరోగ్యం కూడా ఇలాంటి వ్యాధులనైనా తట్టుకునే సామర్థ్యాన్ని కలిగిస్తుందని మనసుకు కూడా ఎంతో ఉత్సాహాన్ని కలిగిస్తుందన్నారు. క్రీడాకారులను ఉత్సాహపరిచే విధంగా మంత్రి రోజా, క్రీడాకారులతో పాటు క్రికెట్, వాలీబాల్, కబడ్డీ ఆడారు. ఈ కార్యక్రమంలో చిత్తూరు పార్లమెంట్ సభ్యులు రెడ్డెప్ప, చిత్తూరు జే.సి. వెంకటేశ్వర్, డిఇఓలు విజయేంద్ర, శేఖర్, ఆర్డీఓ సృజన, ఎంఆర్ఓ చంద్రశేఖర్, మునిసిపల్ కమీషనర్ వెంకట్రామి రెడ్డి, సెట్విన్ సిఇఓ మురళీకృష్ణ మేనేజర్ మురళి, నగరి నియోజకవర్గం లోని అన్ని మండలాలకు చెందిన ఎంపీపీలు, జెడ్పీటీసీలు, నగరి,పుత్తూరు మున్సిపల్ చైర్మన్,వైస్ చైర్మన్ లు, కౌన్సిలర్ లు,పంచాయితీ సర్పంచులు, ఎంపీటీసీలు ఆలయ కమిటీ చైర్మన్, ప్రాథమిక వ్యవసాయ బ్యాంకు చైర్మన్, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్,ప్రజా ప్రతినిధులు వైఎస్సార్ సీపీ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

గ్రామాల్లోనే సమస్యల పరిష్కారం

నూతన సచివాలయాన్ని ప్రారంభించిన మంత్రి రోజా

విజయపురం : ఏ గ్రామంలో సమస్య వస్తే ఆ గ్రామంలోనే పరిష్కరించే దిశగా ప్రతి గ్రామంలోనూ గ్రామ సచివాలయం, రైతు భరోసా, వెల్నెస్ సెంటర్లను నిర్మిస్తున్న దేశంలోనే ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని మంత్రి ఆర్కే రోజా అన్నారు. సోమవారం పన్నూరులో రూ.40 లక్షలతో నూతనంగా నిర్మించిన గ్రామ సచివాలయ భవనాన్ని మంత్రి రోజా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ బాలాజీ, దరశథరాజు, ఆర్‌బీకే చైర్మన్ గుణశేఖర్‌రెడ్డి, ఆనందన్, సర్పంచ్ కుమార్, గోపినాథ్, ప్రసన్న, శివరాజు, హరినాయుడు, కుమార్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు

ఆశవర్కర్ సలోమిని వెంటనే విధుల్లోకి తీసుకోవాలి

సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి చైతన్య డిమాండ్

ప్రజాశక్తి -పలమనేరు: అక్రమంగా తొలగించిన ఆశా వర్కర్ జెమార్గరెట్ సలోమినీ వెంటనే విధుల్లోకి తీసుకోవాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి చైతన్య డిమాండ్ చేశారు. అందులో భాగంగా సోమవారం పట్టణంలోని పాతపేట పిహెచ్‌సి కేంద్రంలో ప్రజా సంఘాల నాయకులు కార్యకర్తలతో ఆందోళన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇకనైనా ఆశా వర్కర్లపై పైన కక్ష సాధింపు చర్యలు మానుకొని సలోమిని వెంటనే వీధుల్లోకి తీసుకోవాలని లేనిపక్షంలో జిల్లా వ్యాప్తంగా అన్ని ప్రజాసంఘాల నాయకులతో డిఎంహెచ్వో కార్యాలయం ముట్టడి చేస్తామని హెచ్చరించారు. అనంతరం పీహెచ్సీ హెల్త్ మెడికల్ ఆఫీసర్ విజయకాంత్‌కు మెమొరాండం అందించారు. ఈ కార్యక్రమంలో ఐద్వా జిల్లా కన్వీనర్ భువనేశ్వరి, సిఐటియు మండల అధ్యక్ష కార్యదర్శులు గిరిధర్ గుప్తా సుబ్రహ్మణ్యం, ఆశా వర్కర్ జిల్లా నాయకురాలు సావిత్రి, ఐద్వా పట్టణ కార్యదర్శి జయంతి, కెవిపిఎస్ జిల్లా ఉపాధ్యక్షులు పాకాల సుబ్రహ్మణ్యం, సిఐటియు నాయకులు భాగ్యలక్ష్మి, కరీమున్నీసా, సెల్వి, మంజుల, పద్మావతి, లక్ష్మమ్మ బుజ్జమ్మ తదితరులు పాల్గొన్నారు.

ధర్నా నిర్వహిస్తున్న సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి

నామమాత్రపు లీజుతో ప్రభుత్వ భూములు మాయం

చోద్యం చూస్తున్న అధికారులు - మండిపడ్డ టిడిపి నాయకులు

ప్రజాశక్తి -పలమనేరు: పట్టణంలోని మదనపల్లి రోడ్డులో గల మత్స్య శాఖకు సంబంధించి సుమారు 2.5 ఎకరాల స్థలాన్ని నామమాత్రపు లీజుతో అధికారి పార్టీకి చెందిన నాయకులు కబ్జా చేస్తున్నారని టిడిపి పట్టణ ప్రధాన కార్యదర్శి గిరిబాబు, బీసీ సెల్ కార్యదర్శి సుబ్రహ్మణ్యం గౌడలు విమర్శించారు. సోమవారం పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..... పలమనేరు పట్టణ అభివృద్ధి కోసం కేటాయించిన ప్రభుత్వ భూములను 99 సంవత్సరాల లీజు పేరుతో ఆలీబాబా అందరూ దొంగలే అన్న రీతిలో తమకు నచ్చినట్లు బినామీ పేర్లతో భూములను కబ్జా చేసుకుంటున్నారని వాపోయారు. అందుకు సంబంధించి మున్సిపల్ కమిషనర్, తహశీల్దార్లు ప్రభుత్వ భూములను పరిరక్షించకపోగా వారికి మద్దతుగా నిలవడం సమంజసం కాదన్నారు. పుర ప్రజలు ఉద్యోగులు మేధావులు అర్థం చేసుకుని తిప్పి కొట్టాలని విజ్ఞప్తి చేశారు. అభివృద్ధి చేతకాదు గాని దోచుకోవడమే ధ్యేయంగా పనిచేస్తున్నారని ఎద్దేవా చేశారు. ఇకనైనా సంబంధిత అధికారులు చొరవ తీసుకొని భూములను పరిరక్షించాలని లేనిపక్షంలో టిడిపి ఆధ్వర్యంలో వరుస పోరాటాల ద్వారా ప్రజల ఆస్తులను కాపాడుకుంటామని వాగ్దానం చేశారు. టిడిపి పట్టణ కమిటీ నాయకులు పాల్గొన్నారు

జ్యోతిరావు పూలే ఆశయ సాధనకు కృషి

అద్దంకి రమణ మూర్తి

ప్రజాశక్తి -పలమనేరు: మహాత్మా జ్యోతిరావు పూలే ఆశయ సాధనకు కృషి చేస్తామని బిసి ఫ్రంట్ వ్యవస్థాపకులు అద్దంకి రమణమూర్తి అన్నారు. సోమవారం పట్టణ బీసీ కార్యాలయం వద్ద మహాత్మ జ్యోతిరావు పూలే వర్ధంతి దినోత్సవం బి.సి.ఫ్రంట్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా...మహాత్మ జ్యోతిరావు పూలే ఆశయాలను రాజకీయాల కతీతంగా సామాజిక సేవే లక్ష్యంగా గ్రామగ్రామాన విస్తరింప చేస్తామని బి.సి.ఫ్రంట్ కార్యవర్గ కమిటీ తీర్మానం చేశారు. అదేవిధంగా పలమనేరు పట్టణంలో మహాత్మా జ్యోతి రావు పూలే విగ్రహం ఏర్పాటు చేయడానికి కృషి చేస్తున్నట్లు రమణమూర్తి తెలిపారు.

ఈ కార్యక్రమంలో బీసీ సంఘం జిల్లా ఉపాధ్యక్షులు ఏ. ఆర్. కుమార్, బజ్జయ్య ,పలమనేరు నియోజకవర్గ అధ్యక్షులు పూలే గోవిందస్వామి నియోజకవర్గ గౌరవ అధ్యక్షులు నంజుండప్ప, మండల నాయకులు రామమూర్తి, నాగరాజు, పలమనేరు పట్టణ అధ్యక్షులు లక్ష్మీపతి యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



రామకుప్పం: మహాత్మ జ్యోతిరావు పూలే వర్ధంతిని మండల ప్రజా ప్రతినిధులు, అధికారులు ఘనంగా నిర్వహించారు. సోమవారం రామకుప్పం మండల కార్యాలయంలో జ్యోతిరావు పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. అనంతరం స్పందన కార్యక్రమం నిర్వహించి ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ప్రజా సమస్యలపై సత్వరమే పరిష్కరించాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేశారని అధికారులు తెలిపారు. ఎంపీపీ సుబ్రహ్మణ్యం, జెడ్పిటిసి నితిన్ రెడ్డి, వైసీపీ మండల కన్వీనర్ బాబు రెడ్డి, కో కన్వీనర్ చంద్రారెడ్డి, ఎంపీడీవో రాధాకృష్ణ, అజ్మత్, అధికారులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి రంగులపోటీల్లో..

విజేతలకు బహుమతులు ప్రదానం

ప్రజాశక్తి - గంగాధరనెల్లూరు: జాతీయస్థాయి రంగుల పోటీల్లో అక్కదేవతలకండిగ మునస్వామి నాయుడు హైస్కూల్ విద్యార్థులు 16 మంది బహుమతులు సాధించారని ఇన్చార్జ్ హెచ్.ఎం ప్రతిమ దేవి తెలిపారు. మహారాష్ట్ర ముంబై సంస్థ ద్వారా కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన పిలుపుమేరకు గత నెల 5, 6 తేదీల్లో స్థానిక హైస్కూల్లో 60 మంది విద్యార్థులు కాగితాల్లో రంగులు లేని గీయబడిన బొమ్మలను పంపించగా స్థానిక విద్యార్థులు వాటికి రంగులు వేసి ముంబై పంపించారు. వాటి ఫలితాలను, అదేవిధంగా బహుమతులను ప్రశంసా పత్రాలు సోమవారం హైస్కూల్‌కు చేరాయి. ఈ సందర్భంగా విద్యాదాతలైన మాజీ కర్ణాటక మంత్రి దివంగత రఘుపతి నాయుడు అదే విధంగా అతని సోదరుడైన దివంగత బెంగళూరు నాయుడు సతీమణి సుశీలమ్మ, ప్రసాద్ నాయుడు, బెంగళూరు నాయుడు మనవడు అభిషేక్ నాయుడులచే గెలుపొందిన విద్యార్థులకు ఆరు గోల్డ్ మెడల్, రెండు సిల్వర్ మెడల్, ఆరు బ్రాంజ్ మెడల్, రెండు షీల్డ్‌లను, ప్రశంసాపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా బెంగళూరు నాయుడు సతీమణి సుశీలమ్మ స్థానిక హైస్కూల్లో పదవ తరగతి పరీక్షల్లో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు ఫస్ట్ రూ.10వేలు, సెకండ్ రూ.5వేలు, థర్డ్ రూ.2,500లను విద్యార్థులకు అందించనున్నట్లు ప్రకటించారు.



ప్రభుత్వ పథకాలను అర్హులకు అందించండి

ప్రజాశక్తి-పెద్దపంజాణి: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలను అర్హులైన లబ్ధిదా రులకు అందించాలని ఎంపీపీ ఎన్.రెడ్డప్ప అన్నారు. సోమవారం బట్టందొడ్డి, లింగాపురం సచివాలయాలను తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. ప్రభుత్వం సచివాలయం ఏర్పాటు చేసిందని, సిబ్బంది అర్హులైన లబ్ధిదారులను గుర్తించి సంక్షేమ పథకాలను అమలు చేయమని సచివాలయ సిబ్బందికి సూచించారు. అదేవిధంగా కరసనపల్లి ప్రభుత్వ పాఠశాలలో జరుగుతున్న నాడు -నేడు పనులను పరిశీలించి త్వరితగతిన పనులు పూర్తి చేయాలని గుత్తేదారులకు సూచించారు. అనంతరం పాఠశాలలో అమలవుతున్న మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేశారు. ఎంపీడీవో భాస్కర్,గ్రామ కార్యదర్శులు సచివాలయ సిబ్బంది,పాఠశాల ప్రధానోపాధ్యాయులు రుద్రాణి పాల్గొన్నారు.

యోగా ఆరోగ్యానికి మూలం

ప్రజాశక్తి-కార్వేటినగరం: యోగా విద్యార్థులకు ఆరోగ్య పరిపుష్టి అని డీఎం పురం ఉన్నత పాఠశాల హెచ్‌ఎం నమశ్శివాయ అన్నారు. సోమవారం పాఠశాల ఆవరణంలో విద్యార్థులకు వ్యాయామ ఉపాధ్యాయుడు తిరుమలరాజు శిక్షణ కల్పించారు. హెచ్‌ఎం మాట్లాడుతూ యోగాతో ఆరోగ్యం పదిలంగా ఉంటుందని, వయస్సుతో సంబంధం లేకుండా ప్రతి ఒక్కరూ యోగా చేయడం అవలర్చుకోవాలని సూచించారు. అనంతరం విద్యార్థులచే పలు యోగాశనాలను వేయించారు.

శ్రీకాళహస్తి ఎమ్మెల్యేని కలిసిన ముస్లిం జెఎసి సభ్యులు

ప్రజాశక్తి -బంగారుపాళ్యం: శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డిని సోమవారం బంగారుపాలెం మండలం ముస్లిం జేఏసీ సభ్యులు కలిసి ముస్లిం జేఏసీకి ఆర్థిక సాయం చేయాలని విన్నవించారు. ఈ సందర్భంగా ముస్లిం జేఏసీ అధ్యక్షులు ఫిరోజ్ అహ్మద్ మాట్లాడుతూ ముస్లిం జేఏసీ సభ్యులు కోవిడ్ పరిస్థితిలో అనాథ శవాలను దహనక్రియలు చేపట్టామని పేదలకు ఆర్థిక సాయం చేస్తున్నామని ఆదు కోవాలన్నారు. తిరుపతి జిల్లా వక్ఫ్ బోర్డ్ చైర్మన్ షేక్ సిరాజ్ భాష, ముస్లిం జేఏసీ వైస్ ఉపాధ్యక్షులు లాలు, మైనార్టీ నాయకులు హిద్దు, ముస్లిం జేఏసీ కోశాధికారి షంషీర్, సభ్యులు బొబ్బర్ రాజా, ముస్లిం మైనార్టీ సోదరులు తదితరులు పాల్గొన్నారు.

డీకేటి భూములకు పట్టాలివ్వండి

భూకబ్జాదారులను అరికట్టండి

ప్రజాశక్తి -భైరెడ్డిపల్లి: మండలంలోని గంగినాయనపల్లి గ్రామపంచాయతీ పరిధిలో ఉన్న సర్వే నంబర్ 47 పశువుల బీడు భూమి పూర్వపు పెద్దలు పెంచుకునేవారు. ప్రస్తుతం దాంట్లో 47 మంది రైతులు పంటలు చేసుకొని జీవనం గడుపుతున్నారు. భూ సర్వేలో భాగంగా భూ ఆక్రమణకు పాల్పడుతున్నారని ఆరోపణ రావడంతో కొత్త ఇండ్లు గ్రామానికి చెందిన రైతులు జిల్లా కలెక్టర్‌కి సోమవారం వినతి పత్రం అందజేసేందుకు చిత్తూరు కలెక్టర్ కార్యాలయానికి బయలుదేరి వెళ్లారు.

రాష్ట్ర ఈడిగ కార్పొరేషన్ కార్యాలయం ప్రారంభం

ప్రజాశక్తి -నగరి: రాష్ట్ర ఈడిగ కార్పొరేషన్ ఛైర్‌పర్సన్ కార్యాలయం తిరుపతి రాష్ట్ర విద్యుత్ శాఖా మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రా రెడ్డిని రాష్ట్ర వైకాపా ట్రేడ్ యూనియన్ సెక్రెటరీ కే.జే కుమార్, రాష్ట్ర ఈడిగ కార్పొరేషన్ ఛైర్‌పర్సన్ కే.జే శాంతి మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా తనను గుంతకల్ నియోజకవర్గ పరిశీలకులుగా నియమించినందుకు ధన్యవాదాలు తెలిపారు. పార్టీ గెలుపు, బలోపేతం కోసం నిర్విరామంగా కృషి చేస్తానని చెప్పారు. అనంతరం శాలువా కప్పి సన్మానించారు.

ఘంటసాల పాటల పోటీలు

ప్రజాశక్తి- పలమనేరు: డిసెంబరు నెల 4వ తేదీ ఆదివారం ఘంటసాల జయంతిని పురస్కరించుకొని ఘంటసాల పాటల పోటీలు కళామందిరంలో నిర్వహిస్తున్నట్లు తెలుగు సాహిత్య సాంస్కృతిక సమితి అధ్యక్షులు పి.తులసినాథం నాయుడు తెలిపారు. గాయకులు తమ పేర్లను 934624900 నంబరుకు ఫోన్ చేసి 2వ తేదీలోపు నమోదు చేసుకోవాలన్నారు. మొదటి, ద్వితీయ, తృతీయ బహుమతులు వరుసగా రూ.2వేలు, రూ.15 వందలు, రూ.వెయ్యితో బాటు ప్రశంసాపత్రాలు అంది స్తామన్నారు. ఇద్దరికి ప్రోత్సాహక బహు మతులు అందిస్తామని ప్రజలు, గాయకులు, సినీ గేయ అభిమానులు, పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

మహాసభల కరపత్రం విడుదల

ప్రజాశక్తి -పలమనేరు: డిసెంబర్ 7, 8, 9 తేదీల్లో ఒంగోలు జిల్లాలో జరిగే ఆంధ్రప్రదేశ్ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర 4వ మహాసభలు జయప్రదం చేయాలని కోరుతూ ఏఐటీయూసీ జిల్లా గౌరవ అధ్యక్షులు ఎస్ నాగరాజు ఆధ్వర్యంలో ఆ సంఘం నాయకులు కరపత్రాలు సోమవారం విడుదల చేశారు. యూనియన్ గౌరవ సలహాదారులు మద్దెల సుబ్రహ్మణ్యం, ఏఐటియుసి నాయకులు బుర్ర మంజునాథ్ బాబు, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు శ్రీనివాసులు, చిన్నప్ప పాల్గొన్నారు.

బీసీ చిత్తూరు పార్లమెంట్

కన్వీనర్‌గా బుస్సా నాగరాజు గౌడ్



ప్రజాశక్తి -బంగారుపాలెం : చిత్తూర్ పార్లమెంట్ తెలుగుదేశం పార్టీ ఈడిగ బీసీ సాధికారత కన్వీనర్‌గా పూతలపట్టు నియోజకవర్గ బంగారుపాళ్యం మండలం నలగాంపల్లి గ్రామానికి చెందిన సీనియర్ టీడీపీ నాయకులు బుసా నాగరాజగౌడ్ నియమించినట్టు ఆయన ఒక ప్రకటన తెలిపారు. ఆయన మాట్లాడుతూ పార్టీకి ప్రజలకు అందుబాటులో ఉండి తన పదవికి తగు న్యాయం చేస్తానన్నారు.

వైసిపి ఎమ్మెల్యే, అతని సోదరుడిపై

హత్యాయత్నం కేసు పెట్టాలి

ప్రజాశక్తి - గంగాధరనెల్లూరు: మాజీ ముఖ్య మంత్రి చంద్రబాబునాయుడు అతని కుమారుడు నారా లోకేష్‌లపై అనుచిత వ్యాఖ్యలు చేసిన అనంతపురం జిల్లా రాప్తాడు నియోజకవర్గ వైసీపీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి, అతని సోదరుడైన చంద్రశేఖర్ రెడ్డిలపై హత్యాయత్నం కేసు పెట్టాలని టిడిపి నేతలు డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక పోలీస్ స్టేషన్లో ఏఎస్ఐ మనోహర్‌కు టిడిపి నేతలు ఫిర్యాదు చేశారు. మండల టిడిపి అధ్యక్షుడు స్వామిదాస్, పార్లమెంట్ టిడిపి ఉపాధ్యక్షుడు వెంకటేష్, టిడిపి ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి దేవ సుందరం, నియోజవర్గ టిడిపి ఎస్సీ సెల్ అధ్యక్షుడు గుండయ్య, నేతలు నెల్లపల్లి సుబ్రమణ్యం, అగరంశివా, దామోదరంలు ఉన్నారు

'ఇందిర క్రాంతి పథం'పై ర్యాలీ

ప్రజాశక్తి-పెద్దపంజాణి: మండల మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో ఇందిర క్రాంతి పథంపై సోమవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీఎం క్రిష్ణప్ప మాట్లా డుతూ లింగ వివక్షతపై మాసోత్సవాల్లో భాగంగా గ్రామ సమాఖ్య అధ్యక్షులు, సంఘమిత్రలకు అవగాహన కల్పించారు. ఇందిర క్రాంతి పథకంపై గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ బాగారెడ్డి,వైస్ ఎంపీపీ జీడీ బాబు, సీసీలు, సంఘమిత్రలు పాల్గొన్నారు.

అక్రమ మద్యం స్వాధీనం - వ్యక్తి అరెస్టు

ప్రజాశక్తి -పలమనేరు: కర్నాటక రాష్ట్రానికి చెందిన మద్యాన్ని కారులో అక్రమంగా తరలిస్తున్న ఓ వ్యక్తిని అరెస్టు చేసినట్లు పలమనేరు సిఐ చంద్రశేఖర్ తెలిపారు. సోమవారం పట్టణ పోలీస్ స్టేషన్లో విలేకరుల సమావేశంలో అరెస్టును చూపించారు. వారు చెప్పిన వివరాలు ఇలా ఉన్నాయి.. సోమవారం ఉదయం 7 గంటలకు బైపాస్ రోడ్డు పైపు నుండి పలమనేరు టౌన్‌లోకి అక్రమంగా కర్నాటకకు చెందిన మద్యాన్ని కారులో తరలిస్తున్నారని రాబడిన, నమ్మదగిన సమాచారంపై ఎస్ఐ సుబ్బారెడ్డి , సిబ్బందితో కలిసి పలమనేరు టౌన్, దండపల్లి క్రాస్ వద్ద వాహనాలను తనిఖీ చేస్తుండగా, అదే సమయంలో పలమనేరు టౌన్, మదనపల్లి రోడ్డు, రఘువీరా రెడ్డి కాలనీకి చెందిన లేట్ శేఖర్ కుమారుడు కె. శీను,(32) అతను ఎపి 038398 నంబరు గల టాటా నానో కారులో 90 ఎంఎల్ 576 చీప్ లిక్కర్ టెట్రా ప్యాకెట్లను అతనికి తెలిసిన వ్యక్తి వద్ద నుండి కొనుక్కొని, ఇక్కడ కాలనీలో అమ్ముటకు వస్తుండగా, సదరు వ్యక్తిని పట్టుకొని, అతని వద్ద ఉన్న కారును, కర్నాటకకు చెందిన చీప్ లిక్కర్ టెట్రా ప్యాకెట్స్‌ను సీజ్ చేసి కేసు నమోదు పరచి, రిమాండ్ నిమిత్తం కోర్టులో హాజరు పరిచినట్లు తెలిపారు.

టీడీపీ మైనారిటీ నాయకుల అక్రమ అరెస్టు

ప్రజాశక్తి- పలమనేరు: ఏలూరు జిల్లా నరసాపురంలో జరిగిన సిఎం సభకు వెళ్లిన మహిళలు, ముస్లిం మహిళల నల్ల చున్నీలతో పాటు బుర్ఖాలను అనుమతించకపోవడంపై సోమవారం టీడీపీ మైనారిటి సెల్ ఆధ్వర్యంలో చిత్తూరు కలెక్టర్ కార్యాలయం వద్ద చేపట్టదలచిన 'జగన్ హఠావో బుర్ఖా బచావో' నిరసన దీక్ష కార్యక్రమానికి తరలుతున్న మైనారిటీ నాయకులను అక్రమ అరెస్టు చేసి పోలీసులు స్టేషన్‌కు తరలించారు. దీనిపై జిల్లా మైనారిటీ అధ్యక్షులు ఖాజాపీర్ అక్రమ అరెస్టును తీవ్రంగా ఖండిస్తూ రాబోయే ఎన్నికల్లో ముస్లిం మైనారిటీల సత్తా ఏమిటో చూపిస్తామని మైనార్టీ నాయకులు హెచ్చరించారు. అక్రమ అరెస్టు అయిన వారిలో మైనారిటీ నాయకులు చాంద్ భాష, అఫ్రోజ్, అమానుల్లా, నదీమ్, బాబాజాన్, సాధిక్ లు ఉన్నారు.

వైసీపీ పాలన ఆంధ్రప్రదేశ్ ప్రజల ఖర్మ

గాలి భానుప్రకాష్ విమర్శ

ప్రజాశక్తి -నగరి: ఒక్క ఛాన్స్ పేరుతో అధికారంలోకి వచ్చిన వైసీపీ పాలన చూసిన ఆంధ్రప్రదేశ్ ప్రజలు ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి అని బాధపడుతున్నారని నగరి నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇన్చార్జి గాలి భాను ప్రకాష్ పేర్కొన్నారు. సోమవారం నగరి పట్టణంలోని ఓ ప్రయివేటు కళ్యాణమండపంలో జరిగిన నియోజకవర్గ స్థాయి సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. అన్ని వర్గాల ప్రజలు వైసీపీ పాలనలో ఇబ్బందులు పడుతున్నారని, ఏ ఒక్కరిని వదలకుండా బాదుడే బాదుడు పక్కాగా అమలు చేస్తూ దోచుకుంటున్నారని విమర్శించారు. టీడీపీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబునాయుడు ఆదేశంతో జరుగుతున్న ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి అనే కార్యక్రమాన్ని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లి ప్రతి ఒక్కరిని చైతన్యం చేయాలని పిలుపునిచ్చారు.

సర్వజన మహాసభ గోడపత్రిక ఆవిష్కరణ

ప్రజాశక్తి -యాదమరి: ఏపీ పబ్లిక్ హెల్త్ అండ్ మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ సర్వ జన మహాసభ గోడపత్రికను ఆవిష్కరించిన జిల్లా డాక్టర్ రవి రాజు. డిసెంబర్ మాసంలో జరగనున్న ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ హెల్త్ అండ్ మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర సర్వేజన మహాసభ గోడపత్రికను డిఐఓ డాక్టర్ రవి రాజు ఆవిష్కరించారు. సోమవారం చిత్తూరులోని జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ అధికారి కార్యాలయంలో నెలవారి సమావేశం జరిగింది. సమావేశంలో ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ హెల్త్ అండ్ మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా అధ్యక్షులు ఏ. లక్ష్మీనారాయణ డిసెంబర్ నెల 11వ తేదీన యూనియన్ రాష్ట్ర సర్వజన మహాసభ జరుగుతుందని తెలిపారు.

ఆడపిల్లలపై జరిగే హింసకు ముగింపు పలకాలి

ప్రజాశక్తి -యాదమరి: యాదమరి మండలం సింధియా సంస్థ, సూచి స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో బాలికలు, మహిళలపై లైంగిక వేధింపుల నిరోధం నిషేధం పరిహారం ర్యాలీ అవగాహన కార్యక్రమం యాదమరి జెడ్పి హైస్కూల్‌లో జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జిల్లా బాలికల పరిరక్షణ సమితి లీగల్ అడ్వైజర్ ఎంఎస్ వెంకటేశులు, ఎస్ఐ, సి.శివ శంకర్ ఓ,ఆర్, డబ్ల్యూ, ఉమాదేవి పాల్గొని జెడ్పి హైస్కూల్ విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో క్రాస్ స్వచ్ఛంద సంస్థ డైరెక్టర్ భూపతి, సింధియా ఫీల్డ్ ఆఫీసర్ పాల్ విజయ్ కుమార్, పెన్ను, తినుబండారాలు అందజేశారు ఈ కార్యక్రమంలో వన్‌స్టాప్ సెంటర్ సోషల్ కౌన్సిలర్, కౌన్సిలర్ పి.జయసుధ, నందు, జె.విజయచంద్రన్, సంధ్య, సిబ్బంది థామస్ వరదరాజ్, జాకాప్, ధనలక్ష్మి, సూచి సిబ్బంది చిన్నయ్య పాల్గొన్నారు

మహిళా సంఘాలకు పెరటికోళ్లు పంపిణీ

ప్రజాశక్తి -పులిచెర్ల : మండలంలోని స్వయం సహాయక మహిళా సంఘాలకు సోమవారం ఎంపీపీ సురేంద్రనాథరెడ్డి చేతులుమీదుగా పెరటికోళ్లు పంపిణీ చేశారు. ఎంపీపీ సురేంద్రనాథ రెడ్డి మాట్లాడుతూ స్వయం సహాయక సంఘాల మహిళలకు ఉపాధి కల్పించడంతో పాటూ పల్లెల్లో కోళ్ల పెంపకాన్ని వృద్ధి చేయడానికి ప్రభుత్వం డీఆర్డీఏ ద్వారా కోళ్ల పంపిణీని చేపట్టిందన్నారు. ఒక్కో యూనిట్‌లో 11 కోళ్లు ఉంటాయని, యూనిట్ ధర రూ:3000గా నిర్ణయించడం జరిగిందన్నారు. మండలానికి మంజూరైన128 యూనిట్ల కోళ్ల పంపిణీ పూర్తయిందన్నారు. నాటు కోళ్ల పెంపకంపై మహిళా సంఘాలు దృష్టి పెట్టాలని తెలిపారు. ఏపీఎం చంద్రమోహన్, నాయకులు, సీసీలు, సంఘమిత్రలు, స్వయం సహాయక సంఘాల మహిళలు పాల్గొన్నారు.

యువజనోత్సవాల్లో విజేతలకు అభినందన సభ

ప్రజాశక్తి -వెదురుకుప్పం: యువజనోత్సవాలు 2022 సంవత్సరానికి గాను శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయం నిర్వహించిన కల్చరల్ యాక్టివిటీస్‌లో వెదురుకుప్పం మండల కేంద్రంలో డా. వైయస్సార్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల గ్రూప్ సంగీత విభాగంలో పాల్గొన్న విద్యార్థులు మూడవ స్థానంలో బహుమతులు గెలుపొందరని కళాశాల సోమవారం ప్రిన్సిపాల్ డా.అన్నపూర్ణ శారద మీడియాకు తెలిపారు. మొదటి సారి విశ్వవిద్యాలయానికి అర్హత సాధించి గ్రూప్ సాంగ్స్‌లో విజేతలైన విద్యార్థినిలు కె.పూజ, నేహా, కల్పన, స్నేహ, గౌరీలను ప్రిన్సిపాల్ అభినందించారు. కల్చరల్ కోఆర్డినేటర్ డా. కె భీమ మోహన్ రావు కళాశాలకు చేసిన సేవలను అభినందిస్తూ ఇలాంటి బహుమతులు కళాశాలకు తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో విద్యార్థులు, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

ప్రతిభ చాటిన విద్యార్థులకు బహుమతులు అందజేత

ప్రజాశక్తి -వెదురుకుప్పం: మండలంలోని జెడ్పి ఉన్నత పాఠశాల వెదురుకుప్పంలో పిల్లల ప్రతిభను అభినందిస్తూ జిల్లాస్థాయి పోటీలలో జనరల్ పోస్టర్ విభాగంలో మొదటి బహుమతి పొందిన కె..గాయత్రి (9వ తరగతి)ఆజాద్ కా అమృత మహోత్సవ్ విభాగంలో తృతీయ బహుమతి పొందిన వి. రమ్య(9వ తరగతి)లను ప్రధానోపాధ్యాయులు పి వెంకట రమణారెడ్డి అభినందనలు తెలిపారు. రాష్ట్రస్థాయి పోటీలకు ఎన్నిక కావడంతో వీరు డిసెంబర్ 9వ తేదీన విజయవాడలో జరిగే పోటీలలో పాల్గొనాల్సి ఉందని ఆయన తెలిపారు. వీరికి శిక్షణ ఉపాధ్యాయులుగా సైన్సు ఉపాధ్యాయులు భ్రమరాంబ, జ్యోత్స్న, శ్యామల, మస్తాన్, విజయలక్ష్మిలను ప్రధానోపాధ్యాయులు అభినందనలు తెలిపి సోమవారం సన్మానించారు.

In the court of the Judicial Magistrate of the First Class:Tadpatri

C.C.NO:83/2019

Between:
S.Chand Basha ...Complainant
And
G.Ramanjaneya Reddy ...Accused

To:
Godugu Ramanjaneya Reddy, S/o Late G.Bai Reddy, Tadigivandla Palli Village, Nawabkota Post, Thummarakunta Majara, Pedda Thippa Samudra Mandal, Chittoor Dist.

ముద్దాయికి సమన్లు U-SEC.138 of N.I.ACT ప్రకారం పై కేసులోని ఫిర్యాదు దారుడైన ఎస్.చాంద్‌భాషా అను వ్యక్తి ద్వారా పై కేసులో ముద్దాయిగా చేర్చబడిన తమరి హాజరు నిమత్తము పై కోర్టు ఆదేశాల ప్రకారం మీకు సమన్లు U-SEC.138 of N.I.ACT ప్రకారం అందించడం కోసం ఈ పేపర్ ప్రకటన జారీ చేయడం జరిగింది. తమరు 28-12-2022 వ తేదిన ఉదయం 10:30 గంటలకు స్వయంగా గానీ లేదా న్యాయవాది ద్వారా కానీ పై కోర్టు ఎదుట హాజరై తమరి వాదనలను తెలుపుకోవలెను. లేని యెడల మీ పరోక్షమున తీర్మానించబడును.

(కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)
యం.సతీష్ కుమార్,
పిటీషన్ దారుడి తరుపున న్యాయవాది, తాడిపత్రి
సెల్:9966195400

IN THE COURT OF THE PRL. JUNIOR CIVIL JUDGE,CHITTOOR
I.A. No. 134 of 2020
O.S. No. 482 of 2015

Between:
V.Yasoda ...Petitioner
And :
1)Giri Babu
2)B.Kavitha ...Respondents

Notice to Proposed 6th Respondent

To
P.Subbarajan
S/o P.Ramakrishnaiah Chetty,
r/at D.No.2-77/1,Gurunagar Colony,
Chittoor Town,Mandal and District,AP

Sir, Please take notice that the above **I.A.No.134 of 2020** is posted to **08-12-2022** for your apperance before the said court. Please be present on the said date before the said court **10-30 A.M** either in person or through an advocate and to raise objections if any, failing which the matter will be decided in you absence as ex-parte.

SRI. D.JANARDHAN NAIDU
Advocate-Chittoor